



# స్వయంవరం

ఆకునూరి మురళీకృష్ణ

నిద్రా మెలకువా కాని ఒక అలౌకిక స్థితిలో తేలిపోతున్నట్లుగా ఆమె కళ్లు అరమోడ్పులౌతున్నాయి.

''శృతీ...ఐ లవ్ యూ...'' వరుణ్ మాటలు చెవుల్లో అమృతాన్ని చిలుకుతున్నాయి.

అతని పెదవులు ఆమె శరీరాన్ని శృతి చేస్తున్నాయి.

ఆ స్పర్శకి శరీరం శివరంజని రాగం పాడుతున్నట్లుంది.

రవిగాంచని ఆ అందాలని అంచనా వేయడానికన్నట్లు కదులుతున్నాయతని చేతులు...చిరుగాలి తగిలిన తొలకరి మేఘంలా పులకరిస్తోందామె.

కిటికీలోంచి జాలువారుతున్న వెన్నెల గదంతా పరుచుకుంటోంది.

యుద్ధభూమిలో సైనికుడిలా శ్రమిస్తున్న అతన్ని ప్రోత్సహిస్తున్నట్లుగా వెన్ను నిమరసాగింది.

అతని వేగం రెట్టింపయింది.

అతని కళ్లలో మెరుపు...

ఆమె కళ్లలో మైమరపు...

ఏదో జీవిత సత్యాన్ని అన్వేషిస్తున్నట్లు...

సృష్టి రహస్యాన్ని శోధిస్తున్నట్లు...తృప్తి!

ఒంట్లో రక్తం రైలులా పరుగులు తీస్తోంది. పరిగెట్టే రైలు శబ్దంలా గుండె కొట్టుకునే శబ్దం పైకే వినిపిస్తోంది.

★ ★ ★

నిద్రలోంచి దిగ్గున లేచి కూర్చుంది శృతి.

శరీరమంతా చెమటతో తడిసి ముద్దయిపోయింది.

జరిగినదేమిటో గ్రహించడానికి ఆమెకొక క్షణం పట్టింది... గ్రహించాక సిగ్గుతో బుగ్గలు ఎర్రబడ్డాయి.

తెల్లవారితే పెళ్లిచూపులు...ఇప్పుడేమిటిలాంటి కల వచ్చింది తనకి?

లేచి మంచినీళ్లు తాగి వచ్చి మళ్లీ పడుకుంది.

ఆమెకి నిద్ర రావడం లేదు... అలాంటి కల రావడం అదే మొదటిసారామెకి.

ఎప్పుడూ లేనిది తనకిలాంటి కల ఎందుకొచ్చింది?

ఇంట్లో ఎంతో ఆర్థోడాక్స్ అమ్మాయిలాగ, బయటికెళ్తే కేవలం కెరీర్ ఓరియెంటెడ్ గర్ల్‌లా కనిపించే తనలో అంతర్లీనంగా ఇలాంటి ఆలోచనలు కూడా ఉన్నాయా?

ఆశ్చర్యంగా అనిపించిందామెకి.



వరుణ్‌ని ఎప్పుడూ తనా దృష్టితో చూడలేదు...అతనిలో ఒక మంచి స్నేహితుడిని చూసింది. అతను కూడా ఎప్పుడూ తన చిటికెన వేలుని కూడా తాకలేదు పొరపాటున కూడా.

మరెందుకిలాంటి కల వచ్చింది తనకి?

''మీలాంటి వ్యక్తితో జీవితాన్ని పంచుకునే అవకాశం దొరికితే అది నా అదృష్టంగా భావిస్తాను'' అని అతడన్నప్పుడు తనెంత సున్నితంగా తిరస్కరించింది.

కానీ తనకి తెలియకుండానే తన మనసులో అతనిమీద అనురాగాన్ని పెంచుకుంటోందా?

ఇంకొన్ని గంటల్లో పెళ్లిచూపుల్లో కూర్చోబోతూ తను ఇలా ఆలోచించకూడదనిపించిందా

మెకి.

కళ్లు మూసుకుని ఆంజనేయ దండకం చదువుతూ నిద్రపోవడానికి ప్రయత్నించింది.

అంతలోనే పక్క గదిలోంచి అలారం మోత వినపడింది.

అంటే... తెల్లవారిపోతోందన్న మాట?

ఆమె గుండె ఒక్కసారి ఝల్లుమంది... తెల్లవారుఝామున వచ్చే కలలు నిజమవుతాయంటారు!

''శృతీ లేమ్మా... తలంటు పోసుకోవాలీ...'' అన్న తల్లి మాటలూ వెనుకే తలుపు మీద చేత్తో తట్టిన శబ్దం వినిపించాక ఇంక మంచం దిగక తప్పలేదు శృతికి.

★ ★ ★

ఉదయభానుడి లేత కిరణాలు అప్పుడే భూమిని తాకుతున్నాయి.

తలస్నానం చేసి, జుట్టు ముడివేసుకుని, తులసి కోట ముందు నిలబడి కళ్లు మూసుకుని ధ్యానం చేస్తున్న శృతి ఉలిక్కిపడింది.

వెనుకనుంచెవరో వచ్చి సున్నితంగా హత్తుకున్నారు.

నడుము మీద వెచ్చని స్పర్శ...

చక్కిలిగింతలు పెడుతున్నట్లుగా ఆ చేతులు నడుము మీద నుంచి ముందుకి కదిలి నాభిని తాకి ఇంకొంచెం కిందకి జారుతుంటే...

''అరెరె... వరుణ్... ఏమిటిది? వదులు...'' అంటూ కళ్లు తెరిచి వెనక్కి తిరిగి చూసిన శృతి ఉలిక్కిపడింది.

వెనుక ఎవరూ లేరు!

అప్పటిదాకా తను అనుభవించినది బాలభానుడి తొలికిరణాల వెచ్చదనాన్ని! తనకొచ్చిన ఊహకి ఆమెకి సిగ్గు ముంచుకువచ్చింది.

మరుక్షణంలోనే తేరుకుంది...

ఏమైందివాళ తనకి?

తను కూడా మామూలు అమ్మాయిలా పగటి కలలు కంటోందేమిటి?

తన పిల్లలు అందరిలాంటి మామూలు ఆడపిల్లల్లా ఉండకూడదని ఎంతో ప్రత్యేకంగా పెంచాడు తండ్రి తమని.

ముగ్గురూ ఆడపిల్లలే అయినా.. బాధపడకుండా తన ఆశయాలకి ప్రతిరూపంగా చూసుకోవాలనుకున్నాడు తమని.

ఆడపిల్ల చదువుకోవడానికి బయటికెళ్లడమే తప్పనుకునే సనాతన కుటుంబంలో పుట్టినా కూడా తమని తమకిష్టమైన చదువులు చదివించాడు.

తన కోరిక కాదనలేక ఉద్యోగం చెయ్యడానికి కూడా ఒప్పుకున్నాడు.

పిల్లల పెంపకం మీదా, వారి భవిష్యత్తు మీదా ఆయనకి కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. ఇన్నాళ్లూ తాము కూడా వాటిని గౌరవిస్తూ వచ్చారు.

ఆయన కూడా తమ స్వేచ్ఛకి విలువనిచ్చారు.

ఇప్పుడేమిటి తన మనసిలా ఆయన అభిమతానికి విరుద్ధంగా పక్కతోవలు తొక్కుతోంది?

ఆయన ఎన్నో వ్యయప్రయాసల కోర్చి, తన చదువుకీ, జీవితాశయానికీ తగ్గ సంబంధం వెదికి తెచ్చారు. తనెందుకిలా విపరీతంగా ఆలోచిస్తోంది?

ఒకసారి తల విదిల్చి లోపలికెళ్లింది శృతి.

★ ★ ★

''మనింట్లో ఆడపిల్లలెవరికీ రెండో సంబంధం చూడాల్సిన అవసరం రాలేదు. నీ విషయంలో కూడా అంతే అవుతుంది. జాతకాలు చక్కగా కుదిరాయంట... అబ్బాయి బావుంటాడు... అమెరికాలో ఉద్యోగం... నీకన్ని విధాలుగా తగిన సంబంధం. వాళ్లు కూడా ఎం.సి.ఏ. చదివిన సాంప్రదాయకమైన కుటుంబపు పిల్ల కావాలని చూస్తున్నారుట. అబ్బాయి నిన్నొకసారి చూసి ఊ అనేస్తే ఇంకే అడ్డూ లేదు'' శృతి జడలో పూలు తురుముతూ అంది శృతి తల్లి లక్ష్మి.

శృతి అద్దంలో తననొకసారి పరిశీలనగా చూసుకుంది.

''రచయిత ఎన్ని కథలు రాసినా మనసుపడి రాసినవి కొన్నే ఉంటాయి. చిత్రకారుడెన్ని చిత్రాలు గీసినా మనసు పడి గీసినవి కొన్నే ఉంటాయి... వాటి అందమే వేరు... అలాగే బ్రహ్మదేవుడెంత మంది స్త్రీలని సృష్టించినా మనసు పడి సృష్టించిన వాళ్లు కొందరే ఉంటారు... మీరా కోవలోకే వస్తారు'' మళ్లీ వరుణ్ అన్న మాటలే గుర్తొచ్చాయి.

నిజంగానే బ్రహ్మదేవుడు మనసుపడి సృష్టించిన బొమ్మంత అందంగా ఉంటుందా తను?

నిండైన చీరకట్టులోంచి కూడా తొంగి చూస్తున్న తన పరువపు అందాలనొకసారి పరిశీలనగా చూసుకొంది.

రాత్రి కలలో వరుణ్‌కి విందు చేసిన అందాలు...

''జీవితం మొత్తం వృథాగా గడిపినా ఫర్వాలేదు కానీ.. ఆశయానికి మాత్రం ఒక్క మెట్టు కూడా కిందకి దిగి జీవించకూడదన్నాడండీ... ఒక మహా రచయిత.''

## దిట్ట

**చిన్నప్పుడు ఎన్నో కలలు కంటూ, అవన్నీ నిజమయితే బాగుండనను కుంటాం. ప్రియాంకాచోప్రాని కదిపితే తాను కన్న కలల గురించి తెగ చెబుతుంది. 'చిన్నప్పుడు గోడలమీద సినిమా పోస్టర్లు చూసి ఎంతో ఇన్‌స్పైర్ అయ్యేదాన్ని. సినిమా తారల్ని కలుసుకోవాలనుకునేదాన్ని. అయితే బాలీవుడ్‌లోకి ప్రవేశించాలని ఎప్పుడూ అనుకోలేదు' అంటోంది. ఇదిలా ఉంటే చిన్నప్పుడు ఎయిరోనాటికల్ ఇంజనీర్ కావాలనుకున్నానని చెప్పే ప్రియాంకాకి సైకాలజీ చదవాలని ఉండేదట. కానీ సినిమా ఇండస్ట్రీలోకొచ్చాక అవన్నీ తెరమరుగైపోయినా ప్రేక్షకుల మనస్తత్వాన్ని అంచనా వేసే పనిలో మాత్రం ఆమె బిజీగా ఉంది.**



వరుణ్ ప్రేమని తను తిరస్కరించిన రోజు అతడన్న మాటలు... ఆ రోజు తను సీరియస్‌గా తీసుకోలేదుగానీ, ఇవాళెందుకో పదే పదే గుర్తుకు వస్తున్నాయి.

ఆశయమంటే ఏమిటి? మనోభీష్టం కాదూ?

''పెళ్ళివారొచ్చేశారు'' బయట హడావిడి మొదలయింది.

పెళ్ళికొడుకుని చూసిన వాళ్ళంతా ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టేశారు. అతని అందాన్ని ఫోటోలో చూశారు కానీ, ఫోటోలో కంటే పది రెట్లు అందంగా ఉన్నాడు.

అమెరికాలో ఉంటున్నాడేమో... ఆ అందానికి సౌకుమార్యం కూడా తోడై, ముట్టుకుంటే కందిపోయేట్టున్నాడు.

''శృతీ... నీ అందానికి తగినవాడే దొరికాడే... మీ ఇద్దరి జంటా చూసే వాళ్ళకి కన్నుల పంటే'' అంది శృతి పినతల్లి.

అందరూ సంబంధం కుదిరిపోయిందన్నట్లుగానే మాట్లాడేస్తున్నారు.

''అమ్మాయ్... కాస్త తలెత్తి అబ్బాయిని చూడమ్మా''

## విలక్షణత

**కొంతమంది ధనార్జన కోసమే సినిమాల్లో నటిస్తారు. మరికొందరు వ్యక్తిగత ప్రతిష్టని, ఆత్మ తృప్తి కోసం సినిమాల్లో నటిస్తారు. కొంతమంది దర్శకుల చిత్రాల్లో నటించాలని నటీనటులు కోరుకుంటారు. విలక్షణ దర్శకుడు విశ్వనాధ్ దర్శకత్వంలో రూపొందబోయే చిత్రంలో ఛాన్స్ కొట్టేసిన లయ ఎంతో సంతృప్తిని వ్యక్తం చేస్తోంది. చక్కని కుటుంబ కథాచిత్రంగా రూపొందుతున్న ఈ చిత్రంలో లయ కూచిపూడి డ్యాన్సర్‌గా ఓ విలక్షణమైన పాత్రని పోషిస్తోంది.**

హాల్లోకి వచ్చిన శృతిని అందరూ బలవంతపెట్టారు.

శృతి తలెత్తి పెళ్ళికొడుకుని చూసింది.

ఆమెకి ఎంత వద్దనుకున్నా వరుణ్ గుర్తుకు వచ్చాడు.

వరుణ్ అతనంత అందంగా ఉండడు... అతనంత పెద్ద ఉద్యోగం కూడా చెయ్యడం లేదు... తన ఆఫీస్‌లో కొలీగ్ మాత్రమే.

అయినా వరుణ్‌ని చూసినప్పుడు కలిగిన స్పందన ఇప్పుడు కలగడం లేదు.

శృతి తల దించుకుంది.

''అమ్మాయిని లోపలికి తీసుకెళ్ళండి'' అన్నారు.

* * *

వాళ్ళకి శృతి చాలా బాగా నచ్చింది.

అబ్బాయి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. మిగిలిన విషయాలు కూడా వెంటనే మాట్లాడుకుందాం అన్నారు.

అందరి ముఖాలూ ఆనందంతో వెలిగిపోయాయి.

''అమ్మాయి అభిప్రాయం కూడా ఒకసారి అడుగుతాను'' అన్నాడు శృతి తండ్రి భాస్కరమూర్తి, మొహమాట పడుతూ..

''ష్యూర్... ష్యూర్...'' అన్నారు వాళ్ళు.

ఆయన శృతి కూర్చున్న గదిలోకి వచ్చి ఆమె తల నిమురుతూ ''ఏమ్మా ఏమంటావు? సంబంధం ఖాయం చేసుకుందామా'' అన్నాడు.

అందరూ ఆతృతగా ఆమె సమాధానం కోసం చూస్తున్నారు.

శృతి వంచిన తల ఎత్తలేకపోతోంది.

''మీ ఇష్టం నాన్నా'' అన్న మాటలు ఎంత అందామనుకున్నా అనలేకపోతోంది. ఏదో బలమైన శక్తి అడ్డుకుంటోంది.

సెకన్లు... నిమిషాలు... గంటలు గడుస్తున్నాయి.

శృతి దగ్గర్నుంచి సమాధానం లేదు.

బయట మగపెళ్ళివారిలో గుసగుసలు మొదలయ్యాయి.

చేసేది లేక భాస్కరమూర్తి బయటికి వచ్చి మళ్ళీ కబురు చేస్తామని చెప్పాడు వారితో.

వాళ్ళు ముఖాలు చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయారు.

''చెబితే వినకుండా ఆడపిల్లలకి చదువులూ ఉద్యోగాలూ అంటూ రోడ్డుకెక్కించారు. ఎవర్నో ప్రేమించే ఉంటుంది'' ఇంటికి వచ్చిన బంధువులంతా తలోక రకంగా మాట్లాడసాగారు.

''ఎవరో... ఏమిటో... కనుక్కోండీ...''



అంది లక్ష్మి ఏడుస్తూ భర్తతో.

ఆ మాటలకర్థం ఏమిటో తెలుసు శృతికి.

తన మనసులో ఉన్న వ్యక్తితో జీవితం పంచుకోవడానికి ఉన్న అడ్డుగోడలు... కులం... మతం... జాతీ... జాతకం!

వీటన్నిటికీ అతీతుడు వరుణ్.

ఎప్పుడు పుట్టాడో... ఎవరికి పుట్టాడో తెలియని అనాథ!

ఆ ఒక్క కారణం చేతనే ఇన్నాళ్ళూ అతన్ని తన మనసులోకి రాకుండా బలవంతంగా నెట్టేస్తోంది... కానీ ఇప్పుడు తన మనసు తన చేతుల్లో లేదు!

* * *

వరుణ్‌ని చూస్తూనే అప్రయత్నంగా లేచి నిలబడి నమస్కరించాడు భాస్కరమూర్తి ''మీరా?'' అంటూ.

ఏడాది క్రితం... తన పెద్దమ్మాయి, అల్లుడు వస్తున్న రైలుకి యాక్సిడెంట్ అయిందని తెలిసి హుటాహుటిన యాక్సిడెంట్ అయిన ప్రదేశానికి చేరుకున్నాడు.

కూతురు, పిల్లలు బాగానే ఉన్నారు కానీ అల్లుడికే తలకి బలమైన గాయమై రక్తం చాలా పోయింది. అర్జంటుగా రక్తం ఎక్కించాలి. వాళ్ళ దగ్గర ఆ గ్రూపు లేదు. ఆలస్యం చేస్తే అల్లుడు బ్రతకడన్నారు.

కూతురు తనని పట్టుకుని బావురుమంది.

అప్పుడు చూశాడతన్ని అక్కడ మొదటిసారి.

''మా ఫ్రెండ్ ఈ రైల్లో ఉన్నాడని వచ్చాను. అదృష్టవశాత్తూ అతనికేం దెబ్బలు తగల్లేదు. ఇక్కడి బాధితులకి సహాయం చేద్దామని ఉండిపోయాను. మీ అల్లుడి రక్తం నా గ్రూపుదే. నేనిస్తాను కంగారు పడకండి'' అన్నాడు.

భాస్కరమూర్తి మనసులో చిన్న కదలిక...

తన అల్లుడికి ప్రాణదానం చేసినపుడు అతని కులగోత్రాలు విచారించలేదు తను...

తనకి అల్లుడిగా చేసుకోవడానికి మీనమేషాలు లెక్కిస్తున్నాడు...

అతని గురించి విచారించడానికి వంశచరిత్రలు తెలుసుకోనక్కర్లేదు...

అతనెలాంటి వాడో చెప్పడానికి జన్మనక్షత్రం, జాతక చక్రం అక్కర్లేదు... ఆ రోజు అతని ప్రవర్తన చాలు!

అతని చేతులు పట్టుకొని అన్నాడు. ''మీ ఇష్టప్రకారమే మీ ఇద్దరి పెళ్ళి జరిపిస్తాను బాబూ''

తన కళ్ళ ముందు దృశ్యాన్ని తనే నమ్మలేకపోయింది శృతి.

తన మనసు దోచుకుని తనలోని స్త్రీత్వాన్ని నిద్ర లేపిన వరుణ్ మానవత్వంతో తండ్రి మనసునేనాడో గెల్చుకున్నాడన్న విషయం తెలుసుకున్నాక ఆమె ఆనందానికి అవధుల్లేవు! ☆